# ఆశలవాన

## తాడిగిరి పోతరాజు

చినుకులు. టపటపమంటూ చినుకులు.
తొలకరి చినుకులు.
పగుళ్ళుబారిన నేలతల్లి పెదవులపై
చినుకులు. 'పుడమితల్లికి' పులకరింత.
చినుకులు పడి తడిసిన మట్టి వాసనలు
గాలిలో తేలిపోసాగాయి.

వాన......

ఉరుములూ, మెరుపుల మధ్య వాన. ఎన్నాళ్ళ నుండో ఎదురుచూసిన వాన. ఆశలన్నీ నింపుకున్న వర్షం. ఉగాది పండుగ నాటి నుండి ఊర్విస్తూరిస్తున్న వర్షం. రోహిణీకార్తె వొచ్చిన నాటి నుండి రోజూ మబ్బులతో మురిపించి దాగుడుమూతలాడిన వర్షం.

మొత్తానికి కనికరించింది... ఈనాటికి.

ఎడ్లకొట్టం బయట నిలబడి తడుస్తున్న రాజయ్య ఆకాశంకేసి, దట్టంగా కమ్ముకుంటున్న నల్లని మబ్బుల కేసి పరీక్షగా చూస్తూ సంబరపడిపోసాగాడు.

"ఇక దిగుల్లేదు. ఇక రంధి లేదు. గొడ్ల మేతకు దిగుల్లేదు. రెండు రోజులాగితే భూమి పచ్చబడతది. పరి గడ్డయిపోతుందని దిగులుపడాల్సిన అక్కరలేదు. భూమి పచ్చబడిందంటే ఎక్కడ జూసినా గడ్డే... కంచెల్లో, చేలల్లో గడ్డి... సర్కారు రోడ్ల ప్రక్కన గడ్డి. బండరాయిల్లో పరంపోగుల్లో గడ్డి... ఇక ఎడ్లూ, గొడ్లూ, మేత బద్దుకొని నాకులాడతాయి. రామ సక్కని వాన... దొడ్డు, దొడ్డు సినుకులు పడతన్నాయి. పచ్చిగడ్డి సూటేమోగాని ఈ వానతో నీటి ఎద్దడి పోతది. వాన నిలబడి కురిసిందంటే గుంటల్లో బొంగల్లో నీళ్లు నిలబడతయి. పోరులేని పశువులు కడుపునిండా నీళ్ళన్నా తాగుతయి. ఓర్నీయవ్వ ఎండలు... ఇరగ్గాసినయి ఈ యాడాది. బావుల్లో నీళ్ళు పాతాళ లోకానికి పోయి రెండు బక్కెట్లు తోడగానే, తుప్ప...ఇసుక... మట్టి...ఇప్పుడింక గొడ్లకు తాగటానికి నీళ్లకు కొదవుండదు..." అనుకుంటూ ఆలోచించసాగాడు.

తొలకరి జల్లుల చల్లదనాన్ని అనుభవిస్తూ, ఆలోచిస్తూ, వర్షాన్ని అంచనా వేస్తూ ఆశగా ఆకాశంవంక చూస్తూ భార్యను పిలిచాడు.

"ఏమాయనే...విన్నే...ఇగ్గోసుట్టూ మొగులవుతాంది. ఇక కాలం అయినట్టే. వాగటసాలు వచ్చే వాన కురిసిందంటే రేపే ఇరుబాలు దున్నిపారేస్తా... దంతెలు తోలి తోలి ఉంది మన చెలక. చెలకనీళ్లు తాగిందంటే ఇక పదునయినట్టే... పునాసపైరు ఏం బెడతామంటావే... పెసల్లెలుకుదాం. మూడ్నెల్లు తిరిగేసరికి పంట సేతికొస్తది. రెండు పల్లాలయినా సాలు ఆరొందల రూపాయలొస్తాయి... మనకు దసరా పండగనాటికి అక్కరకొస్తాయి ఈ పైసలు..." అన్నాడు రాజయ్య.

"పునాస పైరు సంగతి తరువాత సూద్దాం. ముందు పుల్లలు పొయ్యి కాడబెట్టు. ముసురు పట్టిందంటే మండిసావవు" లోపలినుండి తొంగి చూసిన రాజయ్య భార్య అంది.

"నే మరిసే పోయినా," అంటూ రెండు వాట్ల కంది పుల్లలు పొయ్యి వద్ద పర్ది సంచలో నిలబడ్డాడు. తడిసిన తలగుడ్డను విదిలించి బొంగుపై ఆరవేసి గోడ ప్రక్కన నిలబెట్టిన కుక్కి మంచం వాల్చుకొని అందులో కూలబడ్డాడు.

"ఏందే?... ఇందాక పెసల్లంటున్నావ్... పోయిన ఏడాది రెండు కుంచాల పెసళ్ళు. ఇత్తు తిరగి రాకుండా పురుగు తిని పోయింది. ఈ ఏడాది పెసళ్ళు మానేసి నువ్వులేసుకుందాం. తెల్ల నువ్వులు రెండు పల్లాలయితే పన్నెండొందలు కళ్ళసూడొచ్చు. పైగా ఇత్తనం కరుసు కూడా ఎక్కువుండదు. పది రూపాయల నువ్వులయితే సాలు. మస్తు" అంటూ మాట్లాడసాగింది.

అయితే భార్య మాటలు ఆలకించే స్థితిలో లేదు రాజయ్య, కళ్ళముందు కురుస్తున్న వాన అతనిలో నిరాశ కలిగించసాగింది.

"వాన పాడుగాను... వంగిసావటం లేదే?... దబీ దబీమని సంపితే బాగుణ్ను. సూరునుండి నీళ్లు దిగుతున్నాయి మెల్లిగా...కానీ...వాన బందవుతోందిరో బగమంతుడా!... కాలం అయిందని సంబరపడి పోతినే... ధూత్తేరీ... ఏం వానో... వల్లకాడో... జనం కూటికీ నీళ్లకూ మాడి సచ్చేరోజులొచ్చినయి..." తన మనసులోని ఆలోచనలను, అనుభూతులను పైకి వినిపించేలా అంటూ రుసరుసలాడుతూ లేచి నిలబడ్డాడు.

అంతలో కారు హారన్ వినిపించింది.

రాజయ్య గుండెలు దడదడలాడాయి.

చెవులు రిక్కించుకొని శ్రద్ధగా కారు శబ్దాన్ని ఆలకించాడు. బుయ్‌బుయ్ మంటున్న కారు తన ఇంటికేసి వస్తున్న శబ్దం. బురదలో దిగబడుతున్న దాని రబ్బరు చక్రాలు నాజూగ్గా ఒక ప్రక్కకు తిరిగి తన ఇంటి ముందుకొచ్చి ఆగిపొయ్యాయి.

బూడిదరంగు జీప్.

ఆ జీప్ వెనుక ట్రాలీ. ఇన్‌స్పెక్టర్ బాబు వెనకాల నడిచివచ్చే పోలీస్ కానిస్టేబుల్‌లా. అందులో పాత సామానులు. ఒక నవారు మంచం. రెండు కుర్చీలు. కరెంటు మోటరు. ఇత్తడి బిందెలు. సత్తు పళ్ళాలు. చిందరవందరగా పడి వున్నాయి. ట్రాలీ వెనుక కోలాహలంగా పిల్లలు.

కారు ఇంజను ఆపుచేస్తూ బలంగా హారన్ కొట్టాడు డ్రైవర్.

చేతులు జోడించుకొని రాజయ్య జీప్ వెనుక నిలబడ్డాడు.

ఫ్రంట్ సీటులో కూర్చున్న ఆఫీసర్ రాజయ్యను దగ్గరకు రమ్మని సైగచేశాడు.

"ఏం రాజయ్యా? రెండు సంవత్సరాల నుండి బ్యాంక్ బాకీ...ఒక్క కిస్తీ కూడా కట్టకుండా మాకు చెయ్యిస్తన్నావ్. మరిప్పుడు ఒక్క కిస్తీ...ఐదొందల రూపాయలు...కడతవా? జప్తు చెయ్యమంటావా?"

"దొరా! మీకెరికలేనిదేముంది... సరిగ్గా రెండు మూడేళ్ళనుండి పంటల్లేవు. పోయిన ఏడాది మిరపతోట వేస్తే... కాతాపూతకొచ్చే సరికి. వానలు బంద్ అయి పోయినయి. పూతంతా ఎండి రాలిపోయింది. ఆ కాసిన నాలుగు కాయలూ నీళ్లులేక తాలుగాయలయినాయి. యాలకు ఒక్క వానబడు కదా... మీ బాకీ ఒక్క కిస్తీలోనే ముట్టిపోవు. కానీ ఏం సేత్తం సెప్పండి. మా కరమ..." అంటూ నొసలు రుద్దుకొని మళ్ళీ మొదలెట్టాడు.

"దొరా! మీది సర్కారు బాకీ. సర్కారు బాకీ ఎగ్గొట్టే దమ్ములెవరికున్నాయి ఈ దునియాలో. పోలీసులను నిలబెట్టి వసూలు సేత్తారు. ఇయ్యాల కాకపోతే రేపు... దొరా! ఈ ఒక్కసారికి దయసూడండి. మిత్తి... సత్తి... అంతా కలిపి ఈ ఏడాది పంటల మీద తీరుసుకుంటా, బాంచను..." అంటూ కాళ్ళు మొక్కటానికి సన్నద్ధుడయ్యాడు.

అయితే ఆఫీసర్ దొర కాళ్ళు బయటలేవు, మొక్కటానికి. అవి జీప్ లోపల స్టీరింగ్ దగ్గరున్నాయి. అందువలన జీప్ టైర్లకు వినయంగా మొక్కాడు రాజయ్య.

"రాజయ్యా! ఈ దొంగ నాటకాలు మానెయ్. ఇప్పుడు అయిదొందలు కట్టు. ఇడిసిపెడతా. లేకపోతే జప్తు చేయిస్తా. ఏం సంగతి..." కోపంగా అన్నాడు.

"పైసల్లేవు. ఈ ఒక్కసారికి దయసూడండి"



దీనంగా రాజయ్య కంఠం.

"లాభం లేదు..."అంటూ ఆఫీసర్ జీప్ దిగాడు.

ఆఫీసర్‌తో పాటు జీప్ దూకిన కానిస్టేబుల్ తన చేతిక్రను ఊపుకుంటూ, మధ్యమధ్యన తన కాలిపై లయబద్ధంగా కొట్టుకుంటూ నిలబడ్డాడు. ఇక తన ప్రతాపం చూపించబోతూన్నట్టుగా. లోనికి చొరబడిన బ్యాంక్ మనుషులు బడబడా రెండు మూతికట్టుబస్తాలు ఈడ్చుకొచ్చి ట్రాలీలో పడవేశారు.

"అయ్యో రాములూ! అవి ఇత్తనపు వడ్లు. వానబడితే నారు బోసుకుందామని దాచుకున్నాం. ఇత్తనపు వడ్ల జోలికి పోకుండా రెండుపూటలా గటక తిని కాలం గడుపుతున్నాం. ఈ ఒక్కసారికి వదిలెయ్యండి. గయి-అయి... పెసళ్ళే...అయినుతా ఇత్తనానికని ఉంచుకున్నాం బాంచను... ఈ రాత్రి సినుకుపడతే రేపే అలుక్కుంటాం. వాటిని తీసుకుపోకండి... మీకు దణ్ణం బెడతా..." అంది రాజయ్య భార్య గోలగోలగా అరుస్తూ-ఏడుస్తూ.

చంకలో పిల్లగాడ్ని నేలమీద పారేసి ఊడిపోయిన సిగను ముడివేసికుంటూ సంచుల వెంట నడిచింది. ఆమె జీప్ వైపు వెళ్ళకుండా కానిస్టేబుల్ తన చేతి క్రను అడ్డంగా అడ్డుపెట్టాడు.

తరువాత మంచినీళ్ళ ఇత్తడి బిందె - నులకమంచం ట్రాలీ పైకి విసిరివేశారు. ఇంకా అటూఇటూ చూస్తే ఏమీ కనిపించలేదు. తలుపుచెక్కలు రెండూ ఊడబీకి ట్రాలీపై పడవేశారు.

రాజయ్య మాత్రం ఉలుకూపలుకూ లేకుండా ఈ తతంగమంతా మామూలే అన్నట్టుగా నిలబడి చూడ సాగాడు. తన వాడలో ఈ రకం జప్తులు ఎన్నో చూశాడు తాను. ఆడవాళ్ళ ముక్కుపుల్లలు, కడియాలు - చివరకు పుస్తెల తాళ్ళు గూడ బ్యాంక్ జప్తుల్లోకి వెళ్ళటం తనకు తెలుసు. కాకపోతే తన వంతు ఈ రోజు వచ్చిందని మనస్సుకు సర్ది చెప్పుకున్నాడు.

జీప్ వెనక్కి తిరిగింది.

దాని వెంట ఊరి పిల్లలు కోలాహలంగా వెళ్ళి పొయ్యారు. జీపుచక్రాలు, ఇంటి ముందు బురదలో చేసిన అచ్చులను చూస్తూ మౌనంగా నిలబడ్డాడు రాజయ్య. ఓదార్పు మాటలు, ఉచిత సలహాలు చెప్పిన చుట్టాలు, పెద్ద మనుషులు అక్కడ్నించి వెళ్ళి పొయ్యారు.

సంజ చీకట్లు కమ్ముకోసాగాయి.

మెడలు సాగబెట్టి తచ్చాడుతూన్న కోళ్ళు తలుపుల్లేని గుమ్మం దాటి లోనికెళ్ళి మూలన చేరాయి.

దీపం బుడ్డి ముట్టించి మొకరం ప్రక్కన బెట్టి... "బువ్వ తిందువుగానిరా... కాళ్ళు సేతులు... కడుక్కో" అంటూ హెచ్చరించింది రాజయ్య భార్య.

కాళ్ళూ చేతులూ కడుక్కున్న రాజయ్య రాతి వెండి పళ్ళెం ముందు కూర్చుని మాటా ముచ్చటా లేకుండా బువ్వ తినసాగాడు.

"ఆ వడ్లు...బువ్వొండుకొని తిన్నా బాగుండేది... ఇత్తనపు వడ్లు... ఇత్తనపు వడ్లని... దాసి, దాసి... బ్యాంకోడి పాలు సేస్తిమి... తిన్నట్టయితే మనకొక వెల గ్రాసం... గెద్ద గనక కోడిపిల్లను తన్నుకపోయినట్టు తన్నకపోయిన్రు బ్యాంకోళ్ళు మన వడ్ల బస్తాలను" రాజయ్య కంచంలో చల్లబోస్తూ భార్య అంది.

"ఉండవే. నీ వడ్లు సల్లంగుండ... ఆ సప్పుడేంది?" అంటూ ఎంగిలి చేత్తోనే బయటికి నడిచాడు ఆ శబ్దం వింటూ.

ఉక్కగా వుంది. గాలి బిగదీసుకొని పోయింది. ఆకు కూడా కదలాడటం లేదు. తన పాత గూన పెంకులపై చప్పుడు. టపటపమంటూ చినుకులు రాలుతూన్న శబ్దం.

బ్యాంకు సిబ్బంది చేతిలో తనకు జరిగిన పరాభవం విత్తనపు వడ్లు పోయిన దిగులూ అన్నీ దూరమైపోయినయి. ఆనందంతో ఛాతీ విరుచుకుని ఆకాశంకేసి చూశాడు.

చుక్కలులేని ఆకాశంలో నల్లని మబ్బులు కదుల్తున్నాయి.

"వాన పోయిందనుకున్నాంగానీ... వానపోలేదే. ఈయ్యాల, రేత్రికి దుక్కి పదునెక్కేంత వానపడతది సూడు. అగ్గో, ఇను, టపటపమంటూ రాలుతున్నయి సినుకులు. ఆ బ్యాంకోల్లు మన నాగలి తీసికొని పోలే. ఆ కాడికి ఆల్లు మంచోళ్ళే. అది కూడా తీసకపోతే మన పని అబోదిబో..." అనుకుంటూ నలుదిక్కులా పరికించ సాగాడు, సంతోషంగా.

చినుకులు...టపటపమంటూ తొలకరి చినుకులు.

పగుళ్ళుబారిన నేల తల్లి పెదవులపై చినుకులు.

(ఆకాశవాణి-హైదరాబాద్ వారి సౌజన్యంతో)